# సరికొత్త పాత కథ



శ్రీకంఠమూర్తి

చీకటి గదిలో ఆవరించిన నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ ఒక వ్యక్తి మరొక వ్యక్తికి చెప్పిన కథ-

విజయవాడ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం చాలా సందడిగా వుంది. ప్రయాణీకులు హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నారు. హైదరాబాదువెళ్లే రైలు ప్రయాణీకులతో కిటకిటలాడిపోతోంది.

"ఏం రైళ్లో ఏమో! నుంచోడానికైనా కాస్త స్థలం వుండదు." అని గొణుక్కుంటూ రైల్లో ఎక్కాను. నా రెండు కాళ్లూ పట్టగలిగినంత స్థలం దొరికించుకుని కుదురుగా నిలబడేసరికి తలప్రాణం తోక కొచ్చింది.

రైలు కదలడానికి సిద్ధంగా వుంది. ప్రయాణీకులమధ్య ఆ రద్దీలో నిలబడి వున్న నాకు ఊపిరాడటమే కష్టమయింది; ఉక్కతో చెమటపోయ సాగింది. రైల్వే వాళ్ళను తిట్టుకుంటూ. బయట చల్లగా వీస్తున్న గాలికి కాస్త మొహం చల్లబరుచుకోవాలని ప్రయత్నిస్తూ కిటికీదగ్గరికి చేరుకుని తల బయటికి పెట్టాను.

ఒక్కసారి రైలుపెట్టెలోకి కలయ చూద్దామా అనుకున్నాను, తల బయటికి పెట్టుకునే. కాని మళ్ళీ ఆ ఆలోచనను విరమించుకున్నాను. ఏముంటుందక్కడ చూడటానికి? అవే ప్రయాణీకుల దెబ్బలాటలు. తిట్లు. త్రోపుడు అంతేగా?

కాని చూడకూడదనుకున్నవాణ్ని కూడా చూసేటట్టు చేసిందొక దృశ్యం. ఒక యువకుడు బహుశా మదరాసునుంచి హైదరాబాదుకు ప్రయాణం చేస్తున్నాడు కాబోలు హాయిగా కాళ్ళు జాపుకుని పడుకుని వున్నాడు.

అతను పడుకునివున్నా ఆతని చూపులు మాత్రం ఎదురుగా కూర్చుని వున్న అమ్మాయి మీదే వున్నాయి.

నాకు నవ్వొచ్చింది. యౌవనంలోవున్న వారి చేష్టలనుచూసి నవ్వుకునే వయసుకాదు నాది. ఆ అబ్బాయి అలా దొంగచూపులు చూడడంలో గల అర్థం నాకు తెలుసు కాబట్టి చిరునవ్వు నవ్వుకున్నాను. ఎందుకో నా జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలు గుర్తుకొచ్చాయప్పుడు.

"నీ జీవితకథ ఎవరికొక్కవాలిప్పుడు?" అన్నట్టు పెద్దగా కూతపెట్టి బయలుదేరింది రైలు. అంతటితో నా ఆలోచనలు మరోవైపు మళ్ళాయి.

రైలు కదలి, చల్లటిగాలి కిటికీలద్వారా లోపలికి జొరబడి శరీరాలకు హాయిగొలపగానే ప్రయాణీకులు ఉత్సాహంతో మాటలు మొదలెట్టారు. కొందరు కబుర్లలోకి మరి కొందరు చర్చలలోకి దిగారు.

నాకు సమీపంలోనే కూర్చున్న విద్యార్థులు కొందరు సినిమాగురించి మాట్లాడుకుంటున్నారు. ఉత్తి మాట్లాడుకోవడంతోనే

తృప్తిపడక వాళ్ళల్లో ఒకవిద్యార్థి తనే సినిమా ప్రొడ్యూసరై, తన స్నేహితుల్లో ఒకడిని హీరో చేసేశాడు. హీరోయిన్‌గా ఎవర్ని బుక్ చేయాలన్న మీమాంస వచ్చింది వాళ్ళల్లో వాళ్ళకు.

ఇప్పుడు తారాపథంలో అగ్రస్థానం ఆక్రమించుకున్న ఏ తారతోనూ నటించడానికి ఒప్పుకోవడంలేదు ఆ హీరో మహాశయుడు.

పెద్దచిక్కే వచ్చిపడింది నిర్మాతగారికి. పదినిమిషాలు తీవ్రంగా ఆలోచించి తన నిర్ణయాన్ని తెలియజేశాడు నిర్మాత.

ఏమిటంటే ప్రసిద్ధ హాలీవుడ్ తారను బుక్ చెయ్యడం.

వాళ్ళ సినిమా పిచ్చికి ఆపుకోలేనంత నవ్వు వస్తున్నా, ఆ వయసలాంటిది లెమ్మనుకుని మరోచోట సాగుతున్న రాజకీయ చర్చలను వినసాగాను.

"మీరెన్నయినా చెప్పండి సార్....మన ప్రభుత్వపు పరిపాలనా విధానమే సరిగ్గా లేదంటాను." అంటున్నాడొకతను.



"అదేమిటండీ అలా అంటారు ? అసలు ప్రభుత్వాన్ని ప్రజలే కదండీ ఏర్పాటు చేసింది ? మనం దాన్ని ఎలా నడిపితే అలా నడుస్తుంది." మరొకరి సమాధానం.

"ఆ....ప్రజలచేతిలో ఏముందిలెండి.... పేరుకుమాత్రం ప్రజాప్రభుత్వం. కాని ప్రజలగోడు వినేవాడెవడు ! ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నాయకమ్మన్యుల తియ్యని మాటలకు మోసపోయి, వాళ్ళు చెప్పినట్లు వింటున్నాం." ఇంకొకరి సమాధానం.

ఆ తరువాత వినబుద్ధేయలేదు నాకు.

రైలు చీకటిని చీల్చుకుంటూ వేగంగా పరుగెడుతోంది.

నేను మళ్ళీ మొట్టమొదట చూసిన యువకుడివేపు చూశాను. పాపం ! అప్పుడే నిద్రపోతున్నాడు.

నేను కూర్చున్న చోటుకు ఎదురుగుండా కూర్చునివున్న దంపతులమీదికి పోయింది నాదృష్టి. బహుశావాళ్ళు నూతన దంపతులయివుంటారు. నేనలా ఎందుకన్నానంటే, ఆమె నునుసిగ్గుతో తలొంచుకుని నెమ్మదిగా మాట్లాడుతోంది. ఆమె భర్త తమ ఇద్దరినీ ఎవరైనా గమనిస్తున్నారేమోనని చుట్టూ ఒకసారి చూసి మరీ మాట్లాడుతున్నాడు.


ఆమెను చూస్తూంటే నా ఆలోచనలు ఇంటివేపు పరుగెత్తాయి, మా లీలకు పెళ్ళయివుంటే ఆమెకూడా ఇలా భర్తతో కలిసి ప్రయాణం చేసేది కదా అనిపించింది. కాని అంతలోనే "అదీ జరక్కపోదు ఒకరోజు." అని మనసుకు సమాధానం చెప్పుకున్నాను.

అంతలో ఆ నూతన దంపతులు గాభరాగా దేన్నో వెతుక్కుంటున్నట్టు కనిపించారు, జరిగిన సంగతి ఎవరికీ తెలియకూడదనుకున్నారో లేక తమను తెలివితక్కువవాళ్లగా అందరూ భావిస్తారనో ఏమో చాలా మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

వాళ్లెంత రహస్యంగా వెతుక్కుంటున్నా అతనిపర్సు మాయమయిందన్న సంగతి కాసేపట్లోనే మా అందరికీ తెలిసిపోయింది. పాపం ! అతని మొహం దిగులుతో కూడుకుని వుంది. అసలే డబ్బు పోయిందన్న బెంగతో వాళ్ళు ఇదవుతుంటే చుట్టూ కూర్చున్నవారి జాలిచూపులూ, సానుభూతి వాక్యాలూ, వాళ్ళని మరింత క్రుంగదీశాయి. వాళ్ళిద్దరూ వెతకడంమాని తలొంచుకుని మౌనంగా కూర్చుండిపోయారు.

అప్పుడు నాకేదో జ్ఞాపకం వచ్చినట్లయి, ఓసారి పెట్టెనంతా కలయజూశాను. కాని రామం ఎక్కడా కనిపించలేదు. నాకు భయంవేసింది. నాచేతి సంచి, బట్టలసంచీ అన్నీ అతనిదగ్గరే వుండిపోయాయి. అసలు అతను రైలెక్కాడో లేక ఆ ప్రయాణీకుల త్రోపుడులో ఎక్కలేకపోయాడో తెలియలేదు. ఇప్పుడేం చేయాలా అన్న చింత పట్టుకుంది నాకు. చివరికి వుండబట్టలేక "రామం.... ఒరే రామం....!" అని గట్టిగా అరిచాను. నా అరుపు విని అందరి తలలూ ఇటు తిరిగాయి. కాని వాటిల్లో రామం తల మాత్రం కనిపించలేదు. నేనలా పెద్దగా అరవడం అందరికీ ఆశ్చర్యం కలిగించిందేమో, "ఎవర్ని పిలుస్తున్నారండీ ?" అని అడిగాడొక ముసలాయన.

మా అబ్బాయండీ ! ... ఈ పెట్టెలో ఎక్కడోవుంటాడనుకున్నానింతసేపూ. కాని యిప్పుడు చూస్తేలేడు. ఎక్కాడోలేదోమరి ! నా సామానంతా వాడిదగ్గరేవుండిపోయింది." అన్నాను.



"ఎక్కేవుంటాడు లెండి....ఎందుకంత కంగారుపడతారు ? వెనుకపెట్టెలో కూర్చున్నాడేమో !"

ఆ ముసలాయన మాటలు నాకు కొంత ఊరట కలిగించాయి.

ఇదిలా వుండగా ఆ పర్సు పోగొట్టుకున్న నూతన దంపతుల్ని చూసి చాలా జాలేసింది నాకు. మెల్లిగా వాళ్ళకు దగ్గరగా జరిగి పరిచయం చేసుకుని సానుభూతిగా "ఇదిగోచూడండీ ..మీరు మరోలా భావించనంటే నే నోమాట చెప్తా....కాలం మారిపోయింది కాబట్టి ఈ రోజుల్లో యెవర్నీ నమ్మకూడదు. ఎందుకైనా మంచిది. వచ్చే స్టేషనులో రైలాగినప్పుడు ఒకసారి అందరినీ సోదాచేయడం మంచిది. ఏమంటారు ?" అన్నాను.

నా మాటలతనికి నచ్చలేదనుకుంటా. ఒక్కసారి తల విదిలించి "ఛ ! ఛ ! అదేం పని. నా అజాగ్రత్తవల్ల పర్సు పోయింది గాని...." అన్నాడు.

"ఒక వేళ మీరు టికెట్ కొనేటప్పుడు గాని, లేక మరేమైనా కొనేటప్పుడుకానీ, పర్సు బయటికి తీసి ఎక్కడైనా మర్చి పోయారేమో !" అన్నాను.

"వుండొచ్చు. నాకైతే అసలదెలా పోయిందో అంతుబట్టటంలేదు." అన్నా డతను. ఆ తరువాత ఏం మాట్లాడాలో తెలియక వూరికే వుండిపోయాను నేను.

ఆ తరువాత స్టేషనులో రైలాగినప్పుడు మా రామం నేనుండే పెట్టెలోకి ఎక్కాడు. తను ప్రక్క పెట్టెలో కూర్చున్నట్టు చెప్పాడు. నే నతనికి ఏమైనా ఫలహారం పట్టుకురమ్మని పంపించాను. వాడువెళ్లాడు.

నాదృష్టి మళ్ళీ ఆ దంపతుల మీదకు వెళ్ళింది. పాపం ! టిఫిన్ తీసుకోవడానికి కూడా డబ్బులున్నాయో, లేవో వాళ్ళ దగ్గర ?

"ఇదుగో చూడండి. మీకు ఏమైనా కావలసివస్తే సంకోచించకుండా చెప్పండి. అమ్మాయ్ ! నువ్వుకూడా అంతే. నీకు తండ్రిలాంటివాణ్ని ! సిగ్గు పడకుండా ఏం కావాలో అడుగు. నాచేతనయిన సహా యం చేయడానికి సిద్ధంగా వున్నాను. నేను కూడా హైదరాబాదుకు వస్తున్నవాణ్నే !" అన్నాను.

వాళ్ళు నావేపు ఆత్మీయంగా చూశారు. మా రామం పట్టుకొచ్చిన ఫలహారాన్ని ఆర గించారు. వాళ్ళ చూపులో కృతజ్ఞతాభావం గోచరించింది నాకు.

రైలుస్టేషన్‌నుంచి కదిలింది. రైల్లో అందరూ ఎక్కడివాళ్ళక్కడే ఎలావుంటే అలాగే నిద్రపోయారు. కాని నాకుమాత్రం నిద్రరావడంలేదు. ఇలాంటి ప్రయాణాలు యెన్నోసార్లు చేసిన నాకు వాటి తాలూకు అనుభవాలు గుర్తుకురాసాగాయి. చిత్ర మేమిటంటే నేను ప్రయాణం చేసినప్పుడల్లా ఏదో వింత సంఘటన జరుగుతూనే వుంటుంది. నేను ప్రేక్షకుణ్నిగా చూస్తాం టాను వాటిని. ఆ సంఘటన జరిగిపోయిన తరువాత ఆ వ్యక్తుల ఆనందంలో, లేక విచారంలో ;పాల్గొని ఆత్మీయత కనబరిచే అవకాశం మాత్రం పోగొట్టుకోను.

క్రిందటినెల ఇలాగే ప్రయాణం చేస్తూం డగా ఒక మూడేళ్ళ అబ్బాయి తప్పి పోయాడు. వాణ్ని తల్లి - తండ్రులకు అప్పజెప్పేలోగా నాకు కలిగిన అనుభవం అబ్బ ! తల్చుకుంటే ఇప్పటికీ ఆనందంతో ఒళ్ళు పులకరిస్తుంది.


ఆ అబ్బాయి చాలా చురుకైనవాడు. ఆ కాసేపటిలోనే నన్ను 'తాతయ్య'గా చేసు కుని నాతో యెన్నో ఆటలాడుకున్నాడు. క్షణంలో కోపం తెచ్చుకోవడం, మరు క్షణమే అంతా మరిచిపోయి తనను నవ్వించడం, బుంగమూతిపెట్టి తనచేత బ్రతిమ లాడించుకోవడం-ఒకటేమిటి ఆ అబ్బాయి ఏది చేసినా ముచ్చటగానే వుండేది.

ఆలోచిస్తూ, అలాగే ఆ యువదంపతుల వైపు చూశాను. ఆమె కళ్ళు బరు వెక్కి మూసుకుపోతున్నాయి. అయితే ఆమె పడుకోవడానికి కాదుగదా అటూ ఇటూ కదలడానికి కూడా చోటు లేదు. నా గుండె కరిగి నీరైపోయింది.

ఆమె భర్తను మెల్లిగా పిలిచి "మీరు ఇక్కడకువచ్చి కూర్చోగలరా ? పాపం ! అమ్మాయికి చాలా నిద్రవస్తోంది. పడుకుం టుందేమో !" అని నేను కూర్చున్నచోటు








నుంచి నిలబడ్డాను. అతనువచ్చి కూర్చు న్నాడు, అతని భార్య మాత్రం. కూతురు తండ్రివైపు చూసినట్టు చూసింది నావేపు. కృతజ్ఞత నిండివుందా చూపులో. చాలు ! నాకా తృప్తి ఒక్కటే చాలు. దానికోసం ఒక్క హైదరాబాదేమిటి, ప్రపంచం అంచు దాకా ఒంటికాలిమీద నిలబడి వెళ్ళరమ్మన్నా వెళ్ళిరాగలను.

అతను నావైపుతిరిగి "మీరు హైదరాబా దులో ఏం చేస్తున్నారు ?" అని ప్రశ్నించాడు.

"ఏదో చిన్న వ్యాపారం చేసుకుంటు న్నాను. అద్దె ఇంట్లో నివాసం. ఐదుగురు పిల్లలు. పెద్దపిల్లకి పెళ్ళిచేయాలి. రెండో వాణ్ణి కాలేజీలో చేర్పించాలి. తక్కిన ముగ్గురూ చిన్నవాళ్ళు. మీరేం ఉద్యోగం చేస్తున్నారు?"

"నేను సెక్రటేరియట్‌లో ఉద్యోగం చేస్తున్నానండీ. ఇల్లు హిమాయత్ నగర్‌లో వుంది."

సంభాషణ అంతటితో ఆగిపోయింది.

ఆ తరువాతి స్టేషనులో నాకు కూర్చోడానికి స్థలం దొరికింది. హైదరాబాదు చేరుకునే వరకు మేలుకునే వుండిపోయాను.

రైలు హైదరాబాదు స్టేషనుకొచ్చిఆగింది.

"ఏమమ్మాయ్! రాత్రి బాగా నిద్ర పట్టిందా?" అని అడిగాను.

ఆమె చిరునవ్వు నవ్వి "మీ దయవల్ల బాగానిద్రపోయాను. ఈసారి మా ప్రయాణం ఎంతో సుఖంగా గడిచిపోయింది" అందామె.

"నేను కోరేదీ అదే. అందరూ సుఖంగా సంతోషంగా వుండాలనే నా కోరిక. దాందే ముందిగాని యిప్పుడు నావల్ల మీకేమైనా సహాయం కావాలంటే చెప్పండి. తప్ప కుండా చేస్తాను?" అన్నాను.

"మీ ఉద్దేశం మా కర్థమయింది. కాని మేము హైదరాబాదు చేరుకున్నాం. కాబట్టి ఇంకేం ఫరవాలేదు. ఇంటికి వెళ్ళిపోగలం." అన్నాడతను నవ్వుతూ.

"అన్నట్టు మరచిపోయాను. మీ అడ్రస్ యివ్వండి. ఎప్పుడైనా హిమాయత్‌నగర్ వచ్చినప్పుడు మీ ఇంటికి వస్తాను." అన్నాను.

అడ్రసు వ్రాసిచ్చి వాళ్ళిద్దరు వెళ్ళిపోయారు.

• • •

అంతవరకూ ఓపిగ్గా వింటున్న వ్యక్తికి ఇహ ఓపిక చచ్చిపోయింది.

"ఛీ! ఇదేం కథ? అసలిందులో ఏముందని ఇంతగొప్పగా చెప్పుకొచ్చావ్?

"అసలు కథంతా ఇక్కడే వుందిరా వెర్రినాగన్నా. మా రామం సంగతి నువ్వు మరిచేపోయినట్టున్నావు. తను కొట్టేసిన పర్సుతెచ్చి నాచేతికిచ్చాడు వాడు. అందులో వున్న డబ్బు లెక్కపెట్టి చూద్దును గదా సరిగ్గా రెండువందలు రూపాయలున్నాయి. వాటిలో రామంకు ఇరవై రూపాయలిచ్చాను..... సెక్రెటేరియెట్‌లో ఉద్యోగం చేస్తున్నానన్నాడే వాడొట్టి దద్దమ్మ.... నేను నిజంగా వ్యాపారం చేస్తున్నాననుకున్నాడు కాబోలు. నేను చేస్తున్నదేమో ఈ వ్యాపారం...."

"హుం....ఇదీ ఒక కథేనా? నీదంతా బయట తిరుగుతున్నంతసేపేగాని ఇక్కడ కాదని తెలుసుకో!"

"నే నింకా పూర్తిగా చెప్పందే. అప్పుడే తొందరపడితే ఎలాగరా?

నేను ఒట్టి దద్దమ్మ అన్నానే. వాడు సి. ఐ. డి. ఇనస్పెక్టరట! తెలిసింది! కాలం కలిసిరాకపోతే ఎవరైనా అంతేలే? చక్కగా బోల్తాపడతారు."

అతను కథ ముగించేటప్పటికి జైలు గంట ఒక్కసారి మోగింది. చీకటి గదిలో పుట్టిన కథ చీకటిలో కరిగిపోయింది. □□



# వ్యాకారాలు

ప్రవినీతిని అధికారానికి కానుకిచ్చి
ఐదేళ్ళలో ఆరులక్షల్చేసిన
ఆసామి పొగ గొట్టం
నల్లటి ఊహల్తో మెల్లగా
సుళ్ళుసుళ్ళుగా చుట్టుముట్టి చుంబిస్తుంది
అమాయిక
అకలంకాకాశాన్ని.

మహాత్ములూ మతాలూ చూపిన
మహిమలూ సూత్రాలూ రూపరి
సూత్రాల్లేని మొండి బొంగరాలు
ఆత్రంగా దొర్లుతున్నాయి యిటూ అటూ
చూశావా!

సంప్రదాయాల విలువల
చలువపందిరి కప్పెగిరిపోయింది
సందేహాల వడసుడిగాలిలో
చల్లగా నిద్రపోలేవిక!

ఆర్జవానికీ స్వార్జితానికీ నడుమ
ఊర్జస్వితకట్టిన సేతువు మీద
ఆర్జవం మోసే అందలం మీద
ఊర్జస్విత ఊరేగుతూంది
దర్జాగా!

ధగద్ధగాయమానంగా
జగత్సాక్షి నేసిన
జలతారు దేవతావస్త్రంలో
దగా ఉంది ఎక్కడో!

—బి. వి. సింగరాచార్య.